కథా నిలయం
5510
శ్రీకాకుళం

# ఒక వాల్మీకి

రాజులుకు వాల్మీకి అంటే చాలా ఇష్టం; ముదిజేజి కన్నా ఇష్టం; అమ్మ కన్నా ఇష్టం; బళ్లో చదువు చెప్పే రాములు సారు కన్నా ఇష్టం; తనకున్న ఇద్దరు ముగ్గురు సావాసగాళ్ల కన్నా ఇష్టం. వాల్మీకిని రాజులు 'తాతా!' అని పిలుస్తాడు. 'మనవడా' అని వాల్మీకి రాజులును పిలుస్తాడు. ఎప్పుడైనా రాజులు ముదెబ్బ కాలం నాటి సంగతులు చెప్పేటప్పుడో, ముదిజేజి ప్రస్తావన కొచ్చినపుడో 'అదీ చిన్రెడ్డీ కత! అని ముగించేవాడు. వాడిన బంగారం రంగు శరీరం, చాలీ చాలని పై పంచె భుజాల చుట్టూ కప్పుకొని, గోచీపోచీ కట్టిన పంచె, తెల్లబడి మెడ కిందకి వాలిన జుట్టు, పెద్ద నుదురు, ఎక్కడికో చూస్తున్నట్లు ఉండే కళ్లు, కొనదేలిన ముక్కు, నోరు తెరిస్తే తప్ప స్పష్టంగా కనిపించని తెల్లటి మీసాల గుబురులో దాక్కున్న పెదాలు, పొడవాటి నెరిసిన గడ్డం, అమ్మ చెప్పిన కథల్లోని ఋషులు ఇట్లాగే ఉండి ఉంటారని రాజులు నమ్మకం. బడిలో గోడకు వేలాడదీసిన రవీంద్రనాథ్ టాగూరు బొమ్మ చూసినప్పుడు వాల్మీకి తాత లాగే ఉన్నాడని రాజులు అనుకునేవాడు.

బడికి సెలవులొస్తే చాలు. రాజులు వాల్మీకి దగ్గరకు చేరేవాడు – వాల్మీకి ఉంటున్న గూడమిద్దె లోకో, గూడమిద్దె ముందున్న అరుగు మీదికో, గవినిలోని డొంకలో బావి గట్టు నుండే వేపచెట్టు చుట్టూ కట్టిన అరుగు మీదికో, ఊరి పడమటి వైపు రెండు ఊర్లకు వెళ్లే దారులను వేరు చేసే పెద్ద అరుగుతో ఉండే రావిచెట్టు, వేపచెట్టు కిందకో తమ ఇంటికి సేద్యం పనికో, మరొక పనికో వచ్చినపుడు సంగటి తినే సమయంలో రాజులు పక్కన కూచొనేవాడు. వాల్మీకితో వామికొండకు వెళ్లాలనే కోరిక మాత్రం రాజులుకు ఇంకా తీరలేదు. ఏమైనా, వాల్మీకి ఎప్పుడు ఎక్కడుండేదీ

రాజులకు తెలిసినంతగా, ఊళ్లో వాళ్ళకెవరికీ తెలియదు. రాజులు తప్ప ఊళ్లోని మిగతా పిల్లలు వాల్మీకిని చూస్తే జడుసుకునే వాళ్లు; వాల్మీకి నడివీధిలో నడుస్తున్నా, ఇండ్ల సందుల్లో నడుస్తున్నా ఎదురుపడితే తప్పుకునేవాళ్లు. అంత భయం! ముఖ్యంగా వామికొండ మీదుండే ఎంగ గురుడి దేవళానికి వెనుక తట్టు ఉండే రాతిబావి లోని నీళ్లతో తలస్నానం చేసి, వెండి జుట్టూ, గడ్డమూ గాలికి ఎగురుతూ ఉంటే, ఎంగ గురుడిని పూజించి రూపాయంత ఎర్రటి కుంకుమ బొట్టును నొసట బెట్టుకొని పరధ్యానంగా నడిచివస్తున్నపుడు చాలా మంది పిల్లలు చూశారా పారిపోయేవాళ్లు. 'ఇంత మంచోణ్ణి చూస్తే ఎందుకంత భయం?' అని రాజులు తరచూ ఆశ్చర్యపడేవాడు. 'అదీ చానా మంచిదేలే, నేనొక్కణ్ణే బాగా కథలు వినవచ్చు' అనుకునేవాడు. అప్పుడప్పుడూ పిల్లల భయానికి కారణం కనుక్కోవాలనుకునేవాడు. ముదిజేజినో, అమ్మనో అడగాలని ఉండేది. 'ఈ పెద్దవాళ్లను నమ్మకూడదు. అబద్ధాలు చెప్పుతారు. 'అసలు అంత ముసలాడితో నీకెందుకు?' అంటారని బెరుకు.

సంక్రాంతి సెలవుల్లో ఒక రోజు పైటేల పని అయ్యాక వాల్మీకి రావిచెట్టు అరుగు మీదికి చేరి 'భూమి లోన పుట్టు భూసార మెల్లను' అనే వేమన పద్యాన్ని చదువుతున్నాడు. రాజులు పక్కన వచ్చి కూర్చొన్నాడు. పద్యం పూర్తి అయింది. వేమనను గురించి వాల్మీకి ఏదో చెప్పబోతున్నాడు. దారిపక్క కళ్లంలో మేపు కట్టుకొని నెత్తి మీద పెట్టుకొని, అరుగు దగ్గర ఆగి, రంగయ్యనాయుడు వాల్మీకిని పలకరించాడు:

"ఏం మామా! కొండ కింద సేలో సెనిక్కాయ వేసినాం. కాయ పడింది. ఏదుపందులొస్తున్నాయి. రాత్రిళ్లు కావిలికి ఒప్పుకోరాదా?"

వాల్మీకి నవ్వి ఊరుకున్నాడు.

రంగయ్యనాయుడు కాసేపు ఆగి వేళాకోళమాడాడు:

"మా కెందుకు వొస్తావులే మామా. నువ్వొస్తే మాత్రం భరాయించగలమా? చీకట్లో ఇంటి మనిషి వచ్చినా, ఏదు పంది అనుకొని ఈటె విసరగలవు. మీ బోయోళ్ల ధైర్యం మాకెక్కడిది మామా."

ఫక్కున నవ్వుకుంటూ వెళ్లిన రంగయ్యనాయుణ్ణి చూసి రాజులుకు కోపం వచ్చింది. "ఏంది తాత, అట్లా మాట్లాడతాడు?" అన్నాడు.

వాల్మీకి జ్ఞాపకాల వడికి తట్టుకోలేక, కళ్లు తుడుచుకొంటూ చెప్పాడు:

"మనవడా! మీ ముదెబ్బ బాగా వయసులో వుండే రోజులు. నేనూ అంతే. ఆ సారి మాసూలు... మీ కళ్లంలో ముప్పయి పుట్ల జొన్నల రాసి. కావిలుండా, నేనొక్కణ్ణే. జొన్నదంట్ల గూట్లో. చీకటి. చలి. అలికిడంటూ లేని ఏ అపరాత్రో అలికిడి విన్నా–జోన్నలరాసి దగ్గర.

ఫక్కన బెట్టుకున్న నాటుకట్టెను బలంగా చీకట్లోకి విసిరినా–అలికిడి వచ్చిన పక్క. కాసేపు చెవులు రిక్కబెట్టుకొని విన్నా. చప్పుడు లేదు. ఏ కుక్కో లెమ్మనుకొని

పడుకున్నా. మర్సిపోయా. తర్వాత రెం(డ్రోజులకు తెల్సింది. కర్సుగుంటపల్లె దొంగకోళ్ల నారిగాడు చచ్చిపోతూ చెప్పినాడంట–కళ్లంలో జరిగిన సంగతి. ఆయం పాటున దెబ్బేమో సచ్చినాడు. అదిగాదు నన్ను తొలిచింది. నారిగాడు సచ్చినాక ఆ పెండ్లాంగోడు గ్యాపకం వచ్చినప్పుడల్లా ఆడోళ్లది ఏమి జల్మం అనుకుంటా. నేను చేసింది పాపమో పున్నెమో నాకు తెలీదు. అన్నాయం అయిపోయింది మాత్రం నారిగాడి పెండ్లాం.”

రాజులు వాల్మీకిని అదంతా పూర్తిగా చెప్పమని అడగాలనుకున్నాడు. వాడి బుర్ర నిండా అనుమానాలే. వామికొండ వైపు వెళ్తున్న వాల్మీకిని చూస్తూంటే నోటమాట రాలేదు. బెదురు, వణుకు, భయం. ఊరి వైపు పరుగు తీశాడు, రాజులు.

(రచయిత స్వగ్రామం రంగశాయిపురం. ఆ గ్రామానికి చేరువలో వున్న 'వామి' ఆకారం లోని కొండ - వామికొండ. ఈ కొండ వాలులో సన్యాసి గుండు అనే ఒక గుండు కూడా ఉంది. ఈ గుండు మీద ఐదో శతాబ్దికి చెందిన ప్రాకృత జైన శాసనం ఉంది. ఈ శాసనం లోని విషయాలు తెలియని స్థానికులు నిన్న మొన్నటిదాకా ఏదో బంగారం ఉందని రకరకాల పూజలూ, బలులూ చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ వామికొండ ముందు వున్న గ్రామాలు కుడివైపు రంగశాయిపురం, కర్చుకుంటపల్లె, ఎడమవైపు పెనికలపాడు, వెనకవైపు మాదన్నగారిపల్లె ఉంది. దాదాపు ఈ గ్రామాల చుట్టూ తిరిగేవే వామికొండ కతలు. వామికొండ చుట్టుపట్ల గ్రామాలలోని వ్యక్తులే ఈ కతల్లో పాత్రలుగా కన్పించవచ్చు. సన్నివేశాలు, సంఘటనలూ మాత్రం రచయిత కల్పించినవి. పల్లెజీవితం ఒక రచయితను తీర్చిదిద్దటంలో ఎంతగా తోడ్పడుతుందో చెప్పటానికి ఈ కథలు మచ్చుతునకలు (అఫ్సర్ మాటల్లో). ఇంకా రాయని యాభై కథల్లో ఇది మొదటిది.)

● సహకార సమాచారం, ఆగస్టు 1998 ●